


# మన దునియా

Our News Our World

RNI Number TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను

మన దునియా

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

రిపోర్టర్లు కావాలి.

సంప్రదించు ...

9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 264 | మే 22 శుక్రవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-





మహిళా రిజర్వేషన్ల ముసుగులో కేంద్ర ప్రభుత్వం రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని, తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ బిల్లుకు ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. ఈ దేశంలో స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లకు నాంది పలికిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఆయన ఆశయ స్ఫూర్తితోనే పార్లమెంట్, అసెంబ్లీలలోనూ మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలన్నారు.భారతదేశానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, టెలికాం విప్లవాన్ని పరిచయం చేసి ప్రపంచ పటంలో దేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన గొప్ప దార్శనికుడు రాజీవ్ గాంధీ అని రేవంత్ కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సరళీకృత విధానాలే దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాయని గుర్తుచేశారు. తెలంగాణ ప్రాంతానికి, గాంధీ కుటుంబానికి మధ్య దశాబ్దాల కాలంగా ఒక అవినాభావ సంబంధం ఉందని, అది కేవలం రాజకీయ బంధం మాత్రమే కాదని.. కుటుంబ సంబంధాల కంటే ఎంతో పవిత్రమైనదని ఆయన వ్యాఖ్యానించారు.కోట్లాది మంది ప్రజల దశాబ్దాల ఆకాంక్షను గుర్తించి, సోనియా

(మిగతా 2వ పేజీలో..)



## దేశానికి సాంకేతికతను పరిచయం చేసిన నేత రాజీవ్ గాంధీ: సీఎం రేవంత్ రెడ్డి

**మన దునియా,హైదరాబాద్,మే 21**

మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద ఆ మహనీయుడి విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశానికి సాంకేతికతను పరిచయం చేసి ప్రపంచంలో గుర్తింపు తెచ్చిన మహనీయుడు రాజీవ్ అని కొనియాడారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ అని చెప్పుకొచ్చారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. అది కుటుంబ




## బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కోసం ఇన్‌ఛార్జిల నియామకం

**మన దునియా,హైదరాబాద్,మే 21**

బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కోసం అధినేత కేసీఆర్ ఇన్‌ఛార్జిలను ప్రకటించారు. డిజిటల్ ప్రక్రియలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు జరగనుంది. 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను బీఆర్ఎస్ అధినేత నియమించారు. నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు తెలంగాణ భవన్‌లో ఐటీ నిపుణులతో




## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ.. ఆయుధాలతో సహా లొంగిపోయిన 25 మంది మావోలు

**ఝార్ఖండ్ డీజీపీ సమక్షంలో లొంగిపోయిన 25 మంది మావోయిస్టులు**

**లైట్ మెషీన్ గన్స్ సహా పలు రకాల ఆయుధాల అప్పగింత**

**అందరికీ పూర్తి పునరావాసం కల్పిస్తామన్న డీజీపీ**



ఝార్ఖండ్‌లో మావోయిస్టు ఉద్యమానికి కోలుకోలేని మరో దెబ్బ తగిలింది. 25 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర డీజీపీ సమక్షంలో వీరు జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. లొంగిపోయిన

(మిగతా 2వ పేజీలో..)

## తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, మంత్రి వర్గం!

**మన దునియా,తమిళనాడు:మే 21**

తమిళనాడులో విజయ్, కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధమైంది. ఇవాళ లోక్ భవన్ లో జరిగే కార్యక్రమంలో మొత్తం 23 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. ఇందులో 21 మంది టీవీకే నుంచి, ఇద్దరు కాంగ్రెస్ నుంచి ఉన్నారు. కాంగ్రెస్ తమ పార్టీ నుంచి రాజేశ్ కుమార్, విశ్వ నాథన్ ను మంత్రులు గా నియమించాలని పేర్లు పంపింది. గతంలో విజయ్ తో పాటు మొత్తం 10 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పుడు 23 మంది కలిస్తే మొత్తం 33 మంది అవుతారు.అయితే విజయ్ టీవీకేకు మిత్రపక్షాలైన ఐయూఎంఎల్, వీసీకేలకు మంత్రివర్గ విస్తరణలో

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, మంత్రి వర్గం!

(మొదటి పేజీ తరువాయి)



చోటు దక్కలేదు. చెరో ఇద్దరు ఎమ్మెల్యేలతో ఈ రెండు పార్టీలు టీవీకే ప్రభుత్వ సంఖ్యా బలానికి కీలకం. ఐయూఎంఎల్, వీసీకే రెండింటికీ చెరో మంత్రి పదవిని కేటాయించా రని, అయితే వారు ఇంకా తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించలేదని తెలుస్తోంది. దీంతో ఈ రెండు భాగస్వామ్య పక్షాలను ప్రభుత్వంలో తర్వాత దశలో చేర్చుకుంటా రని సమాచారం. ఇవాళ ప్రమాణ స్వీకారం చేస్తున్న టీవీకే ఎమ్మెల్యేలలో శ్రీనాథ్, కమలి ఎస్, సీ విజయలక్ష్మి, ఆర్వీ రంజిత్‌కుమార్, వినోద్, రాజీవ్, బీ రాజ్‌కుమార్, వీ గాంధీరాజ్, మథన్ రాజా పి, జెగదేశ్వరి కె, రాజేష్ కుమార్ ఎస్, ఎం విజయ్ బాలాజీ, తోపాటు.... లోగేశ్ తమిళసెల్వన్ డి, విజయ్ తమిళన్ పార్థిబన్, రమేశ్ కుమార్, ఆర్ విశ్వనాథన్, ఆర్ విశ్వనాథన్, ఆర్ విశ్వనాథన్, మహ్మద్ ఫర్వాస్ జె, డి శరత్‌కుమార్, ఎన్ మేరీ విల్సన్, విఘ్నేష్ కె ఉన్నారు. వీరిలో పలువురు తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు.

# దేశానికి సాంకేతికతను పరిచయం చేసిన నేత రాజీవ్ గాంధీ: సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

సంబంధం కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు.మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు... రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు..

# బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కోసం ఇన్‌ఛార్జిల నియామకం




(మొదటి పేజీ తరువాయి)

డిజిటల్ శిక్షణ ఇవ్వనున్నారు. సభ్యత్వ నమోదు కోసం డిజిటల్ యాప్‌ను రూపొందించారు. తెలంగాణ భవన్‌లో శిక్షణ తర్వాత.. పార్టీ జిల్లా కార్యాలయాల్లో పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు.పోలింగ్ బూత్‌కు ఇద్దరు చొప్పున వారం రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. డిజిటల్ సభ్యత్వ నమోదు శిక్షణ పూర్తయిన తర్వాత.. సభ్యత్వ పునరుద్ధరణను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రారంభించనున్నారు..

# మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయం చేస్తే సహించం: రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

గాంధీ తీసుకున్న సాహసోపేతమైన చారిత్రాత్మక నిర్ణయంతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ గడ్డపై తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం ఇక్కడి ప్రజలు గాంధీ కుటుంబం చేసిన త్యాగాన్ని, సహాయాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న ప్రజా ప్రభుత్వం పూర్తిగా రాజీవ్ గాంధీ ఆశయాలు, స్ఫూర్తితోనే ప్రజాక్షేమం కోసం ముందుకు సాగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు.

# మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ.. ఆయుధాలతో సహా లొంగిపోయిన 25 మంది మావోలు

(మొదటి పేజీ తరువాయి)

వారిలో ఆరుగురు సబ్ జోనల్ కమాండర్లు, మరో ఆరుగురు ఏరియా కమాండర్లు, 13 మంది చురుకైన హార్డ్‌కోర్ సభ్యులు ఉన్నారు. వీరంతా సుదీర్ఘకాలంగా ఝార్ఖండ్‌లోని అత్యంత క్లిష్టమైన కోలహాన్, దట్టమైన సరంద అటవీ ప్రాంతాలలో తమ సాయుధ కార్యకలాపాలను నిర్వహిస్తూ భద్రతా దళాలకు సవాలుగా మారారు.ఈ లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఇందులో ఎల్ఎమ్‌జీ, ఇన్సాస్ రైఫిళ్లు, ఎస్ఎల్ఆర్ లు, 303 రైఫిళ్లు, దేశవాళీ తుపాకులు ఉన్నాయి. లొంగిపోయిన వారిలో మహిళా మావోయిస్టులు కూడా ఉండటం గమనార్హం. 100కు పైగా తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉండి, సుదీర్ఘకాలంగా మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న టాప్ కమాండర్ సాగెన్ అంగారియా అలియాస్ డొకోల్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇంతటి కీలక నేతలు, కేడర్ ఒకేసారి ప్రధాన స్రవంతిలోకి రావడంతో ఝార్ఖండ్‌లో మావోయిస్టు పార్టీ నెట్‌వర్క్ పూర్తిగా బలహీనపడినట్లయింది.ఈ సందర్భంగా ఝార్ఖండ్ డీజీపీ మాట్లాడుతూ... రాష్ట్రంలో తీవ్రవాదాన్ని, నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు భద్రతా దళాలు సమష్టిగా, వ్యూహాత్మకంగా పనిచేస్తున్నాయని కొనియాడారు. హింసను వీడి వచ్చిన వీరందరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తామని, సమాజంలో గౌరవప్రదంగా బతికేందుకు తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఇంకా అడవుల్లో అజ్ఞాతంలో కొనసాగుతున్న మిగిలిన మావోయిస్టులు కూడా తక్షణమే హింసా మార్గాన్ని విడనాడి, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వాడుకుంటూ ప్రధాన స్రవంతిలోకి రావాలని సీఆర్పీఎఫ్ ఐజీ సాకేత్ సింగ్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# సమయపాలనలో సీఎం ఆదర్శం.. తమిళనాడులో మారిన ఆఫీస్ కల్చర్

**ఉద్యోగులు ఉదయం 9:50 కల్లా ఆఫీసులో ఉండాలని పలు శాఖల నుంచి ఆదేశాలు**

**సీఎం విజయ్ ప్రతిరోజూ ఉదయం 10 గంటలకే కార్యాలయానికి వస్తుండటంతో ఈ మార్పులు**

**సీఎం కాన్వాయ్ కారణంగా ఉదయం ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బందులు పడుతున్నామంటున్న ఉద్యోగులు**

**పాలనలో క్రమశిక్షణ పెంచడమే లక్ష్యమని ప్రభుత్వ వర్గాల వెల్లడి**



తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి సచివాలయంలో పని సంస్కృతి పూర్తిగా మారుతోంది. ఆయన సమయపాలనను కచ్చితంగా పాటించడం ప్రభుత్వ శాఖలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో పలు విభాగాల్లో ఉద్యోగుల హాజరుపై కఠిన నిబంధనలు అమల్లోకి వస్తున్నాయి. కార్యాలయాల్లో క్రమశిక్షణను పెంపొందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.అధికార వర్గాల సమాచారం ప్రకారం ముఖ్యమంత్రి విజయ్ పదవి చేపట్టినప్పటి నుంచి ప్రతిరోజూ ఉదయం 9:45 నుంచి 10 గంటల మధ్య సచివాలయానికి చేరుకుంటున్నారు. అధికారిక కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం 4:30 లేదా 5 గంటల వరకు కార్యాలయంలోనే ఉంటున్నారు. సీఎం అనుసరిస్తున్న ఈ విధానం ఇతర శాఖల అధికారులను, సిబ్బందిని సైతం అప్రమత్తం చేస్తోంది. పని వేళలు ప్రారంభం కాకముందే ఉద్యోగులందరూ విధుల్లో ఉండేలా పరిపాలన విభాగాలపై ఒత్తిడి పెరుగుతోంది.ఈ క్రమంలో ఆహార, పౌరసరఫరాల శాఖ మొట్టమొదటగా అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు ప్రధాన కార్యదర్శి పి.బి. శరవణకుమార్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఉద్యోగులందరూ ఉదయం 9:50 గంటల కల్లా విధులకు హాజరు కావాలి. ఆఫీస్ అసిస్టెంట్లు ఉదయం 9:30 గంటలకే రావాలని స్పష్టం చేశారు. అండర్ సెక్రటరీలు ఉదయం 10 గంటలలోపు హాజరు రిజిస్టర్లను మూసివేసి, నివేదికను అదనపు ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి పంపాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ నిబంధనలు పాటించని వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇదే తరహా ఆదేశాలు ఇతర శాఖల్లోనూ జారీ అవుతున్నాయని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి. పాలనా సామర్థ్యాన్ని, క్రమశిక్షణను మెరుగుపరిచేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.కొంతమంది ఉద్యోగుల నుంచి ఆందోళన అయితే, ఈ కొత్త నిబంధనలపై కొంతమంది ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా కామరాజర్ సాలై, మెరీనా రోడ్డు మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. సీఎం కాన్వాయ్ వెళ్లే సమయంలో (ఉదయం 9:30 నుంచి 9:45 మధ్య) ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తుండటంతో కార్యాలయాలకు సమయానికి చేరుకోవడం కష్టంగా ఉందని వారు వాపోతున్నారు. గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఎం. కరుణానిధి, జె. జయలలిత, ఎం.కె. స్టాలిన్ వంటి వారు కాస్త ఆలస్యంగా కార్యాలయానికి వచ్చేవారని, అప్పుడు ప్రయాణం సులువుగా ఉండేదని గుర్తుచేస్తున్నారు. అయితే, మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ కొత్త క్రమశిక్షణ చర్యలు చేపట్టినట్లు స్పష్టమవుతోంది.

# ఇరాన్ యుద్ధం.. ట్రంప్, నెతన్యాహు మధ్య తీవ్ర వాగ్వాదం?

**ఇరాన్ వ్యూహంపై ట్రంప్, నెతన్యాహు మధ్య విభేదాలు**

**ఇరాన్‌పై దాడుల ఆలస్యం పొరపాటన్న నెతన్యాహు**

**దౌత్య చర్చల కోసం ట్రంప్ తాత్కాలిక బ్రేక్**

**శాంతి ఒప్పందం కోసం ఖతార్, పాకిస్థాన్ మధ్యవర్తిత్వం**

**చర్చలు విఫలమైతే దాడులకు సిద్ధమన్న ట్రంప్**

ఇరాన్ యుద్ధాన్ని ముగించే వ్యూహంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మధ్య విభేదాలు భగ్గుమన్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ఇద్దరు నేతల మధ్య దాదాపు గంటపాటు ఫోన్లో వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఇరాన్‌పై వెంటనే వైమానిక దాడులు ప్రారంభించాలని నెతన్యాహు ఒత్తిడి చేయగా, దౌత్య చర్చలకు మరో అవకాశం ఇవ్వాలని ట్రంప్ పట్టుబట్టినట్లు తెలుస్తోంది.

రగిలిపోయిన నెతన్యాహు

మీడియా కథనాల ప్రకారం.. ఈ ఫోన్ కాల్ తర్వాత నెతన్యాహు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇరాన్‌తో శాంతి చర్చలపై నెతన్యాహు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. దాడులను ఆలస్యం చేయడం పెద్ద పొరపాటని, ఇరాన్ సైనిక సామర్థ్యాలను దెబ్బతీసేందుకు ప్లాన్ ప్రకారం యుద్ధాన్ని కొనసాగించాల్సిందేనని ఆయన ట్రంప్‌తో వాదించినట్లు తెలుస్తోంది.

చర్చలకే ట్రంప్ మొగ్గు

యుద్ధానికి స్వస్తి పలికేలా అమెరికా–ఇరాన్ మధ్య సంతకాలకు ఖతార్, పాకిస్థాన్ దేశాలు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు ట్రంప్ వివరించినట్లు తెలుస్తోంది. అణు కార్యక్రమం, హర్మూజ్ జలసంధి తెరిచే అంశాలపై 30 రోజుల పాటు చర్చలు జరపాలని ట్రంప్ భావిస్తున్నారు. ఒకవేళ అవి విఫలమైతే మళ్లీ యుద్ధం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం.

పైకి మాత్రం ‘ఆల్ ఈజ్ వెల్’

నెతన్యాహుతో తీవ్రమైన విభేదాలు వచ్చినా ట్రంప్ మాత్రం బయటకు ఏమీ తెలియనట్లే వ్యవహరిస్తున్నారు. ఇరాన్ విషయంలో తాను ఏం చెబితే నెతన్యాహు అదే వింటారని ట్రంప్ మీడియాకు తెలిపారు. ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ వంటి అరబ్ దేశాల అభ్యర్థన మేరకే ఇరాన్‌పై దాడుల ప్రణాళికను తాత్కాలికంగా ఆపినట్లు ట్రంప్ గతంలోనే ప్రకటించారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# రాజీవ్ గాంధీ సేవలు మరియు ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం





- దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు రాజీవ్ గాంధీ
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గౌ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో టెక్స్టైల్ పార్కు అభివృద్ధి పనులు వేగవంతం అయ్యాయి
- దాదాపు 60 లక్షలతో నిర్మించనున్న రాజీవ్ గాంధీ స్టాచు మరియు పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి



గురువారం గీసుగొండడ సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ పరిధిలోని రాజీవ్ గాంధీ టౌన్ షిప్ లో కూడా నిధులు దాదాపు 60 లక్షలతో నిర్మించనున్న రాజీవ్ గాంధీ స్టాచు మరియు పార్క్ అభివృద్ధి పనులకు కూడా చైర్మన్ శ్రీ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, ఎంపీ శ్రీమతి కడియం కావ్య, నర్సంపేట ఎమ్మెల్యే శ్రీ దొంతి మాధవరెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి,మాజీ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా అధ్యక్షులు శ్రీ ఆయుబ్,జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారద గారితో కలిసి పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు,దేశ ఐక్యత, సమగ్ర అభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ గారు నిరంతరం పనిచేశారు అన్నారు.కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో భూముల కోల్పోయిన భూ నిర్వాసితులకు రుణపడి ఉంటాము అని, రాజీవ్ గాంధీ టౌన్ షిప్ లో మెరుగైన వసతులతో కూడిన ఆధునిక మోడల్ కాలనీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.రాజీవ్ గాంధీ టౌన్ షిప్ లో కూడా నిధులు దాదాపు 60 లక్షలతో స్టాచు, పార్కును అభివృద్ధి చేస్తున్నామన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రత్యేక చొరవ తీసుకొని టెక్స్టైల్ పార్క్ పనులను వేగవంతం చేశారన్నారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని చరిత్రను తిరగరాసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రాజీవ్ గాంధీ గారి కుటుంబం త్యాలగ కుటుంబం అని, దేశ సమగ్రతకు, సమానత్వానికి పోరాటం చేశారన్నారు.ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి పర్యటన అనంతరం భూ నిర్వాసితులకు గృహ నిర్మాణం కోసం 863 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లను మంజూరు చేసారన్నారు.కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో రాజీవ్ గాంధీ టౌన్ షిప్ లో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామపంచాయతీ కార్యాలయం, వెటర్నరీ ఆసుపత్రి, సీసీ రోడ్లు, కల్వర్టు నిర్మాణం, 11 కె.వి 3 ఫేజ్ 5 వైర్ ఎల్టీ లైన్స్, కొత్త ఎం ఎస్ ఎం ఈ క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

# ప్రేమ వేధింపుల ఆరోపణలతో యువకుడికి అరగుండు.. చెప్పుల దండతో ఊరేగింపు

**మన దునియా,అనంతపురం:మే 21**

అనంతపురం జిల్లాలో ఓ యువకుడిని గ్రామస్తులు అవమానకరంగా ఊరేగించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రేమ పేరుతో ఓ వివాహితను వేధిస్తున్నాడనే ఆరోపణలతో గ్రామస్తులు యువకుడికి అరగుండు కొట్టించి, మెడలో చెప్పుల దండ వేసి గ్రామ వీధుల్లో డప్పులు మోగిస్తూ ఊరేగించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.ఈ సంఘటన అనంతపురం జిల్లా గడేకల్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు భాస్కర్ అనే యువకుడు ఓ వివాహితను గత కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో మహిళ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆగ్రహానికి గురైనట్లు తెలుస్తోంది.గ్రామస్తుల కథనం ప్రకారం, భాస్కర్ మరియు ఆ మహిళ గతంలో ప్రేమించుకున్నారని సమాచారం. అయితే కుటుంబ పరిస్థితుల కారణంగా ఆమెకు మరొకరితో వివాహం జరిగింది. పెళ్లి అనంతరం కూడా భాస్కర్ ఆమె వెంటపడటం కొనసాగించాడని స్థానికులు చెబుతున్నారు. దీంతో కుటుంబంలో తరచూ గొడవలు చోటుచేసుకున్నాయని, చివరకు మహిళ భర్త ఆమెను పుట్టింటి వద్ద వదిలి వెళ్లిపోయాడని సమాచారం.తమ కుమార్తె దాంపత్య జీవితం చెడిపోవడానికి భాస్కర్ వేధింపులే కారణమని భావించిన మహిళ కుటుంబ సభ్యులు అతడిని



పట్టుకుని గ్రామ మధ్యలోకి తీసుకొచ్చారు. అక్కడ అతనికి దేహశుద్ధి చేసి, అరగుండు కొట్టించారు. అనంతరం మెడలో చెప్పుల దండ వేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ ఘటనను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో విషయం బయటపడింది.వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు మహిళను వేధించిన వ్యక్తికి తగిన శిక్ష పడిందని అభిప్రాయపడుతుండగా, మరికొందరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరైంది కాదని అంటున్నారు. తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందే కానీ, ఇలాంటి అవమానకర శిక్షలు సమంజసం కాదని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు .ఇప్పటివరకు ఈ ఘటనపై యువకుడి కుటుంబ సభ్యులు అధికారికంగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదని సమాచారం. అయితే వీడియో వైరల్ కావడంతో పోలీసులు స్వయంగా విచారణ ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరిస్తున్న పోలీసులు గ్రామస్తుల చర్యలపై చట్టపరమైన కోణంలో పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## వరి మొక్కజొన్న ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలోఎమ్మార్వో కు వినతి పత్రం అందజేసినారు



**సంగెం,మన దునియా 21**

ఈరోజు సంగెం మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని వరి ధాన్యం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే కాంటాలు గన్ని బ్యాగులు హమాలీలు లారీలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చి ప్రతి గింజ వెంటనే కొనుగోలు చేయాలని ఎతీశీ ఖఅస్త్రవఎ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది లిఈ కార్యక్రమంలో లిబిజెపి సంగెం మండల పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి రంగంపేట సర్పంచ్ శేషాద్రి జిల్లా కౌన్సిల్ మెంబర్ బుట్టి కుమార్ స్వామి ప్రధాన కార్యదర్శి పవన్ సాయి గొర్ల కాపర్ల జక్క చేరాలు ఓబిసి ఎక్స్ అధ్యక్షులు రంగరాజు కృష్ణ నాలం చంద్రశేఖర్ సంఘ సూరయ్య దాసరి నరేష్ బెజ్జంకి రాజు మడ్డి చీరలు

## రైల్వే జూనియర్ ఇంజనీర్ దొంగతనాలు చేస్తూ పట్టుబడ్డాడు

**మన దునియా,కర్నూల్:మే 21**




కర్నూల్: రైల్వేలో జూనియర్ ఇంజనీర్‌గా పని చేస్తూ, రైళ్లలో ప్రయాణికుల బ్యాగులు దొంగతనం చేసిన షాకింగ్ కేసు కర్నూల్ జిల్లాలో వెలుగులోకి వచ్చింది. అనంతపురం జిల్లా యడికి మండలం వాసి పి. బాలరాజు (రైల్వే జూనియర్ ఇంజనీర్) ను కర్నూల్ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. 2013లో రైల్వేలో ఉద్యోగం చేరిన బాలరాజు 2023లో జూనియర్ ఇంజనీర్ పదవికి ప్రమోషన్ పొందాడు. గత రెండేళ్లుగా అడోని రైల్వే స్టేషన్‌లో పని చేస్తూ, రాత్రి సమయంలో రైళ్లలో ప్రయాణికుల లగేజీ దొంగతనం చేస్తూ వచ్చినట్టు పోలీసులు తెలిపారు.

కేసు వివరాలు:

మే 14న నంద్యాల రైల్వే స్టేషన్ పరిధిలో ఒక ఆర్మీ అధికారి బ్యాగు దొంగతనం అయిన విషయం తెలిసి జజుఎ ఫుటేజ్ ఆధారంగా బాలరాజును గుర్తించారు.


కర్నూల్‌లో అతనిని అరెస్టు చేశారు.

అతని నుంచి 198.5 గ్రాముల బంగారు నగలు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, నగదు వంటివి సీజ్ చేశారు.

పోలీసుల ప్రకారం, బాలరాజు పై 7 కేసులు (నంద్యాల్‌లో 4, కర్నూల్‌లో 3) నమోదయ్యాయి. బంగారు నగలు, ఎలక్ట్రానిక్ వస్తువులు దొంగతనం చేసి అమ్ముకుని సొమ్ము చేసుకునేవాడని తెలిసింది.ఈ ఘటన రైల్వే ఉద్యోగుల మీద ఉన్న విశ్వాసాన్ని ఉల్లంఘించినట్టుగా పరిగణించి పోలీసులు మరిన్ని వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నారు.

## కాళేశ్వరంలో ప్రారంభమైన సరస్వతి నది అంత్య పుష్కరాలు!

**మన దునియా,భూపాలపల్లి జిల్లా:మే 21**



జయశంకర్ భూపాల పల్లి జిల్లాలోని కాళేశ్వరంలో పవిత్ర సరస్వతీ అంత్య పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. త్రివేణి సంగమం వద్ద ఉదయం 5:43 గంట లకు తొలి పుష్కర స్నానం ఆచరించిన శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామిజీ పుష్కరాలను ప్రారంభించారు. కంచి కామకోటి పీఠం పీఠాధిపతి నేతృత్వం లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతు లు, కొండా సురేఖ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. త్రివేణి సంగమ తీరంలో ప్రత్యే క పూజలు నిర్వహిం చిన అనంతరం స్వామిజీ, మంత్రులు పుష్కర స్నానాలు ఆచరించారు. పుష్కరాల సందర్భం గా భక్తులతోకాళేశ్వరం కిటకిటలాడుతోంది. ఇక సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రత్యేక హెలి కాప్టర్‌లో కాళేశ్వరం చేరుకోనున్నారు. గవర్నర్ తొలి రోజు పుష్కర స్నానం ఆచరించి, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించ నున్నారు. అనంతరం సరస్వతీ ఘాట్‌లో జరిగే గోదావ రి హారతి, తెప్పోత్సవ కార్యక్రమాల్లో కూడా పాల్గొననున్నట్లు అధి కారులు తెలిపారు.ఇక సరస్వతి పుష్కరాల సమయంలో నదిలో స్నానం చేయడం వల్ల అనేక శుభ ఫలితాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## మార్కెట్ యార్డులో పందులు!

**మన దునియా,కరీంనగర్ జిల్లా:మే 21**



వ్యవసాయ రంగానికి ప్రధాన రాష్ట్రమైన తెలంగాణలో రైతులు తాము పండించిన పంటలను విక్రయించ డానికి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నా రు. మార్కెట్ యార్డు ల్లో కనీస వసతులు కానరావడం లేదు ధాన్యం కొనుగోలు గడువు ఇక 10 రోజులే ఉండగా కల్లాలో ఎక్కడి దాన్యం అక్కడే మిగిలి ఉన్నవి, వరి ధాన్యం కోతలు చేపట్టి నెల రోజులైనా ధాన్యం కొనక పోవడం తో రైతులు దిక్కు తోచని స్థితిలో కొట్టు మిట్టులాడుతున్నారు. కొలుగోలు లక్ష్యంలో ఇప్పటివరకు సగం కూడా ధాన్యం కొనలేదు మొక్క జొన్నల పరిస్థితి కూడా ఇలాగే ఉంది, ఓవైపు అకాల వర్షాలు మరోవైపు పందుల బెడద తో రైతులు కన్నీళ్లు పెడుతుంటే ఆదుకోవలసిన సర్కార్, పట్టించుకో వడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా...కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో రైతులు అమ్మకానికి తీసుకొ చ్చిన వరి ధాన్యంపై పందులు సైర్యవిహారం చేస్తున్నాయి,మార్కెట్ యార్డులోకి ప్రవేశి స్తున్న పందులు ధాన్యం కుప్పలను చెదరగొడుతూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని పందులు నాశనం చేస్తుంటే, ఏ అధికారి కూడా పట్టించుకో వడం లేదని వారు వాపోయారు.మార్కెట్ యార్డులో సరైన భద్ర తా చర్యలు లేకపోవ డంతో పందులు స్వేచ్ఛగా సంచరిస్తు న్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. పందుల కారణంగా ధాన్యం నాణ్యత దెబ్బతింటోందని, కొంత ధాన్యం వృథా అవుతోందని వారు ఆవేదన చెందుతు న్నారు. రైతులు ధాన్యం వద్దే కాపలా ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారు లు స్పందించి మార్కెట్ యార్డులో భద్రత చర్యలు చేపట్టడంతో పాటు, ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## సీఎం పేరుతో కోట్ల దందా..! కేటుగాడు సంతోష్ కుమార్ గుప్తా అరెస్ట్

**మన దునియా,హైదరాబాద్,మే 21:**




సీఎం సన్నిహితుడిని.. కాంగ్రెస్ పార్టీ నాయకుడిని అంటూ ఖరీదైన కార్లలో తిరుగుతూ పలువురిని బెదిరించి భారీ వసూళ్లకు పాల్పడుతున్న కేటుగాడు సంతోష్ కుమార్ గుప్తాను మేడ్చల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల పేర్లు చెప్పుకుంటూ వివిధ రంగాలకు చెందిన వ్యక్తులను బ్లాక్‌మెయిల్ చేసి కోట్ల రూపాయలు దోచుకున్నట్లు పోలీసులు గుర్తించారు. గురువారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ పరిసర ప్రాంతాలైన కుత్బుల్లాపూర్, కొంపల్లి, సుచిత్ర, మేడ్చల్ ప్రాంతాల్లో భూ వివాదాలు, విద్యాసంస్థలను లక్ష్యంగా చేసుకుని సంతోష్ కుమార్ గుప్తా భారీగా డబ్బులు వసూలు చేశాడు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్న లొసుగులను ఆధారంగా చేసుకుని ఆర్టీఐ చట్టం పేరుతో రియల్టర్లను బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసేవాడు. విలాసవంతమైన హోటళ్లలో సెటిల్‌మెంట్లు నిర్వహిస్తూ తనను ప్రభావశీల వ్యక్తిగా చూపించుకునేవాడని విచారణలో వెల్లడైంది.ఇటీవల మునీరాబాద్‌లోని 'ఆరో రియాల్టీ' సంస్థ యాజమాన్యాన్ని బెదిరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. సంస్థ నిర్వాహకులను భయపెట్టి రూ.6 కోట్ల విలువైన ఐదు విల్లాలు లేదా రూ.25 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో బాధితులు మేడ్చల్ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి సంతోష్ కుమార్ గుప్తాను అరెస్ట్ చేశారు.ఈ ఘటనతో రాజకీయ నాయకుల పేర్లు చెప్పుకుంటూ మోసాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలుస్తోంది.

## కేటుగాడు సంతోష్ కుమార్ గుప్తా

**సీఎం మనిషినంటూ బెదిరింపులు..**

**పోలీసుల అదుపులో కేటుగాడు**

**మన దునియా,మేడ్చల్:మే 21**



సీఎం మనిషిని.. కాంగ్రెస్ పార్టీ నాయకుడిని అని చెప్పుకుంటూ ఖరీదైన కార్లలో తిరుగుతూ మోసాలకు పాల్పడుతున్న కేటుగాడు సంతోష్ కుమార్ గుప్తా ఆటను మేడ్చల్ పోలీసులు కట్టించారు. ముఖ్యమంత్రి, మంత్రుల పేర్లు చెప్పి వివిధ రంగాలకు చెందిన వారిని బ్లాక్ మెయిల్ చేస్తూ.. భారీగా నగదు వసూళ్లకు పాల్పడుతున్నాడు. దీంతో పోలీసులకు సంతోష్ కుమార్ గుప్తాపై ఫిర్యాదు అందింది. దాంతో అతడిని గురువారం పోలీసులు అరెస్ట్ చేసి.. రిమాండ్‌కు తరలించారు.హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్, కొంపల్లి, సుచిత్ర, మేడ్చల్ పరిసర ప్రాంతాల్లోని భూ వివాదాలు, విద్యా సంస్థల నుంచి అతడు భారీగా నగదు వసూళ్లు చేశాడు. అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో లొసుగులను లక్ష్యంగా చేసుకుని ఆర్టీఐ చట్టం పేరుతో రియల్టర్లను బ్లాక్ మెయిల్ చేసేవాడు. విలాసవంతమైన హోటళ్లను వేదికగా చేసుకుని అతడు పలు రకాల సెటిల్‌మెంట్లు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడి అయింది. అయితే మునీరాబాద్‌లోని 'ఆరో రియాల్టీ' సంస్థ యాజమాన్యాన్ని సంతోష్‌కుమార్ గుప్తా బెదిరించాడు. ఈ సంస్థ నిర్వాహకులను భయపెట్టి రూ.6 కోట్ల విలువైన 5 విల్లాలు లేదా రూ.25 కోట్లు ఇవ్వాలంటూ సంతోష్ కుమార్ డిమాండ్ చేశాడు. దీంతో మేడ్చల్ పోలీసులను వారు ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు. అతడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దాంతో వారికి సంతోష్ కుమార్ చిక్కాడు..

# కంపెనీ డబ్బులు కొట్టాడు .. షేర్ మార్కెట్లో పెట్టాడు..

**బోలెడు డిగ్రీలు సాధించి మోసాల వైపు హనుమాన్ల లక్ష్మణ్..**

**పరిశ్రమ పరిశీలనలో తేలిన నిజం..**

**రూ.7 కోట్ల 90 లక్షల 27,915 మోసం..**

**నిందితుడి వివరాలు వెల్లడించిన డిసిపి శిరీష**

**మన దునియా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్:మే 21**




కంపెనీ నుంచి బయటకు పంపాల్సిన డబ్బులను తెలివిగా తన ఖాతాలో జమ చేసుకున్నాడు.. కోట్ల రూపాయలు సంపాదించి షేర్ మార్కెట్ కు తరలించాడు.. అక్కడ కూడా నష్టపోయాడు.. చివరికి పోలీసుల చేతికి చిక్కి కటకటాల వెనక్కి వెళ్ళాడు.. పలు డిగ్రీలు చేసి చదువుకున్న ఓ తెలివైన మూర్ఖుడు చేసిన ఈ పని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు మండల పరిధిలోని ఆర్.ఎం. కన్వర్టర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో వెలుగు చూసింది. షాద్ నగర్ డిసిపి శిరీష గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన సమాచారాన్ని వెల్లడించారు. ఆమె అందించిన వివరాల ప్రకారం గత ఆరు నెలల కాలంగా పరిశ్రమలోని అకౌంట్ సెక్షన్ లో పనిచేసే హనుమాన్ వెండర్లకు పంపించాల్సిన డబ్బులు వారికి పంపకుండా వారి పేరుతోనే పంపుతున్నట్లుగా రికార్డులు నమోదు చేసి తన అకౌంట్ కి తరలించుకుంటున్నాడు. అలా ఇప్పటికీ రూ.7.90 కోట్ల పై చిలుకు తన ఖాతాలో వేసుకున్నాడు. ఇటీవల తమకు అందిన ఫిర్యాదు మేరకు డైరెక్టర్ రికార్డులను పరిశీలించగా ఏదో మోసం జరిగినట్లుగా అర్థమైంది. దీనితో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీసీపీ శిరీష, ఏసిపి లక్ష్మీనారాయణ నేతృత్వంలో రంగంలోకి దిగిన ఎస్ హెచ్ఓ సిఐ నరసయ్య పరిశీలించగా జరిగిన మోసం వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో అతని అకౌంట్ నుంచి రూ. 1 కోటి 47 లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఇక అతని వద్ద నుంచి వ్యక్తిగతంగా రెండు లక్షల అరవై వేలు నగదు రూపంలో స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు రెండు స్మార్ట్ ఫోన్లు కూడా పోలీసుల స్వాధీనం అయ్యాయి. మిగతా డబ్బులు అతడు షేర్ మార్కెట్లో ఖర్చుపెట్టి నష్టపోయినట్లు నిందితుడు పోలీసులకు వివరించాడు. ఇలాంటి మోసాలు ఇతని కొత్త కాదు. పోలీసుల విచారణలో అతడు గతంలో జూబ్లీహిల్స్, చందానగర్లలో పనిచేసే చోట కూడా ఇలాంటి మోసానికి పాల్పడినట్లు డిసిపి శిరీష వివరించారు. అడ్డంగా దొరికిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ పంపించినట్లు డిసిపి శిరీష తెలిపారు. మీడియా సమావేశంలో కూతురు సీఐ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు..

# తెలంగాణలో మే 25 నుంచి 'మహిళా వారోత్సవాలు'

**మన దునియా,హైదరాబాద్,మే 21**




మహిళా సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. మే 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'మహిళా వారోత్సవాలు' నిర్వహించనుంది. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ వారోత్సవాలు జరుగనున్నాయి. గ్రామీణ మహిళలు, ఎస్‌హెచ్‌జీ, యువతులు, బాలికలకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ సందర్భంగా జీవనోపాధి యూనిట్లు, రుణమేళాలు, అవగాహన సదస్సులను నిర్వహించనున్నారు. మే 29న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇంక్యుబేటర్ కార్యక్రమం ప్రారంభంకానుంది. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా ఈ కార్యక్రమం జరగనుంది. 'ఎస్‌హెచ్‌జీ మహిళలతో 450 ఆర్టీసీ బస్సుల ఫ్లాగ్ ఆఫ్, 0.5 మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్ల ప్రారంభం, మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు, వడ్డీలేని లోన్లు విడుదల వంటి కార్యక్రమాలు జరుగనున్నాయి. టీనేజ్ బాలికలతో మాక్ పార్లమెంట్ నిర్వహణ, మహిళా సంఘ భవనాలు, గోదాములకు శంకుస్థాపనలు, కోళ్ల పెంపకం, సూక్ష్మ పరిశ్రమల యూనిట్ల గ్రౌండింగ్ వంటి కార్యక్రమాలు కూడా జరగనున్నాయి. దివ్యాంగులకు బ్యాటరీ వాహనాల పంపిణీ, తేనెటీగల పెంపకం, బయో ఇన్‌పుట్ సెంటర్ల ఏర్పాటు, మహిళల భద్రత కోసం ప్రత్యేక వింగ్ కార్యక్రమాలు, టీనేజ్ బాలికలకు సైకిళ్ల పంపిణీ, ఆరోగ్య శిబిరాలు, ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. వారోత్సవాల్లో భాగంగా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయనున్నారు.

మహిళలను ఆర్థిక శక్తులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సీతక్క

మహిళా సంఘాలను గ్రామీణ ఆర్థిక శక్తులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ వారోత్సవాల ద్వారా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా సాధికారత సాధించడానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్థాయిల్లో ఈ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ప్రభుత్వం ప్రకటించింది..

# బాధిత కుటుంబానికి అండగా మాజీ ఎంపీటీసీ మాట్ల వెంకటేశ్వర్లు

**మన దునియా ప్రతినిధి కమలాపూర్**



కమలాపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన శనిగారపు రాజయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీటీసీ మాట్ల వెంకటేశ్వర్లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చిన ఆయన, కుటుంబానికి తక్షణ సహాయంగా 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. అలాగే భవిష్యత్‌లో కూడా కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్ల వెంకటేశ్వర్లు చేసిన సహాయాన్ని అభినందించారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
మే। శుక్రవారం। 22। 2026



# స్వర్గీయ రాజీవ్ గాంధీ కి ఘన నివాళులు





**ఖానాపూర్ ఆర్సి మన దునియా మే: 21.**

మంచిర్యాల్ జిల్లా జన్నారం మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ రెండు పర్యాయాలు భారతదేశనికి ప్రధాన మంత్రి గా పని చేశారని. అతి చిన్న వయస్సులోనే 40 ఏళ్ల కే దేశానికి ప్రధాన మంత్రి అయ్యారన్నారు. దేశానికి టెలికమ్యూనికేషన్స్ వ్యవస్థ, భారతాన్ని ఆధునిక యుగం వైపు నడిపించిన యువ నాయకుడు, ఐటీ రంగానికి పితామహుడుగా, టెలికమ్యూనికేషన్ విప్లవానికి ఆద్యుడుగా, దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడిగా రాజీవ్ గాంధీ ది ఎన్నటికీ చెరగని ముద్ర అన్నారు. గ్రామ స్వరాజ్య సాధనకు పునాదులు వేసి, స్థానిక సంస్థల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు, యువతకు 18ఏళ్లకే ఓటు హక్కు కల్పించి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కీలక సంస్కరణలు తీసుకొచ్చారు అని, ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ చూపిన బాట నేడు ప్రతి ఒక్కరు చూపించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నందునాయక్ , ఏఎంసి ఛైర్మన్ లక్ష్మీ నారాయణ , పట్టణ అధ్యక్షులు మంద రాజేష్ ,జిల్లా ఉపాధ్యక్షులు, గుర్రం మోహన్ రెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇస్సాక్ , జిల్లా కార్యదర్శి ముజాఫర్ , సీనియర్ నాయకులు, సర్పంచ్ లు,వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు,మహిళ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ వైరు తగిలి రెండు పాడి గేదెల మృతి





**రైతుకు రూ.2 లక్షల నష్టం.. ప్రభుత్వ సహాయం కోరిన బాధితుడు**

**మన దునియా కమలాపూర్**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూనిపర్తి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు దిడ్డి తిరుపతికి చెందిన రెండు పాడి గేదెలు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయి.గురువారం పచ్చి గడ్డి మేయడానికి వెళ్లిన గేదెలు బతుకమ్మ వాగు సమీపంలోకి చేరుకున్న సమయంలో విద్యుత్ స్తంభానికి చెందిన వైరు తెగి ఉండటంతో అవి ప్రమాదవశాత్తు వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.ఈ ఘటనతో రైతు దిడ్డి తిరుపతి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గేదెల మృతితో తనకు సుమారు రూ. 2 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు. పాడి ఆధారంగా జీవనం సాగిస్తున్న తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, సంబంధిత అధికారులు నష్టపరిహారం అందించాలని వేడుకున్నారు.గ్రామస్తులు విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని ఆరోపిస్తూ, గ్రామంలో ఉన్న పాత విద్యుత్ వైర్లను వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు.

# భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ సాకారం: మంత్రి పొంగులేటి

**మన దునియా,హైదరాబాద్:మే 21**



భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ సాకారమైందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్ జరిగిందని పేర్కొన్నారు. భూభారతి పోర్టల్‌తో భూమి హక్కులకు శాశ్వత భరోసా కల్పించామని చెప్పుకొచ్చారు. ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయించామన్నారు. రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధన ఉంటుందని స్పష్టం చేశారు. ఈరోజు (మంగళవారం) ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. భూభారతి పోర్టల్ రైతులకు భద్రత, కుటుంబాలకు నమ్మకమని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెవెన్యూ సంస్కరణలు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. ఐదు మండలాల్లో పైలట్‌గా భూభారతి అమలవుతోందని చెప్పుకొచ్చారు. ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకొచ్చామని తెలిపారు. దేశానికి ఆదర్శంగా భూభారతి పోర్టల్ ఉంటుందని వ్యాఖ్యానించారు. కూసుమంచిలో చారిత్రాత్మకంగా తొలి నమోదు చేశామని వివరించారు. రైతు భూమి హక్కులకు ఓ స్పష్టత ఇచ్చామని.. సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పుకొచ్చారు. సర్వే మ్యాప్‌తో యాజమాన్యంపై ఎలాంటి సందేహం లేకుండా చర్యలు చేపట్టామని అన్నారు. ఆధునాతన టెక్నాలజీతో కచ్చితమైన భూసర్వేలు చేపడతామని.. దశలవారీగా రాష్ట్రమంతా అమలు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు..

## వాజేడు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ధాన్యాగార నిల్వ కేంద్రాన్ని పరిశీలించిన ములుగు జిల్లా ఎస్పీ

**మన దునియా వాజేడు మే 21**



వాజేడు మార్కెట్ నిల్వ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఐపీఎస్ గురువారం అధికారులతో కలిసి సందర్శించి మొక్కజొన్న కొనుగోలు రవాణా ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు జిల్లాలో మొక్కజొన్న పండించిన రైతుల వద్ద నుంచి కొనుగోలు తోందరగ పూర్తి చేసి ధాన్యాన్ని వెంటనే మార్కెట్ గిడ్డంగులకు తరలించాలని మార్కెట్ కమిటీ అధికారులను ఆదేశించారు ఆలస్యం వల్ల రైతులు వ్యాపారులు నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు మొక్కజొన్న రవాణా వాహనాల కొరత ఉంటే వెంటనే స్థానిక అధికారుల సహకారం తీసుకొని సమస్యలను పరిష్కరించాలని సూచించారు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు నీడ అయితే అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు ఈ సందర్భంగా ఎటునాగారం ఎస్పి మనన్ బట్ ఐపీఎస్ ములుగు డిఎస్పి రవీందర్ ఎస్బీ ఇన్స్పెక్టర్ శంకర్ ఏటూర్ నాగారం సిఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## కర్రెగుట్టల రహదారి పనులను పరిశీలించిన జిల్లా ఎస్పీ తొందరగా పూర్తి చేసి నాణ్యత పాటించాలని ఆదేశం

**మన దునియా ,వాజేడు ,మే 21**



వెంకటాపురం మండల పరిధిలోని కర్రెగుట్టల ప్రాంతాన్ని ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఐపిఎస్ గురువారం పోలీస్ అధికారులతో కలిసి సందర్శించారు ఈ సందర్భంగా మురుమూరు నుంచి పామునూరు జల్లా డోలి మీదుగా తడపాల వరకు రోడ్డు నిర్మాణంలో ఉన్న రహదారి పనులను పరిశీలించి తొందరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్కు ఆదేశించారు పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని సూచించారు రహదారి నిర్మాణ పనులు నిమిత్తం రాత్రింబవళ్లు బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు సిబ్బందితో మాట్లాడి ఎస్పీ వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఏ ఎస్ పి మనన్ బట్ ఐపీఎస్ ములుగు డిఎస్పి రవీందర్ ఎస్బి ఇన్స్పెక్టర్ శంకర్ వెంకటాపురం సిఐ రమేష్ ఎస్సై తిరుపతి తదితరులు పాల్గొన్నారు

## వెంకటాపురంలో రాజీవ్ గాంధీ వర్ధంతి

**మన దునియా ,వాజేడు ,మే 11**



స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువరానివని కాంగ్రెస్ నాయకులు కొని ఆడారు గురువారం ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహావరణం లో రాజీవ్ గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని నవ యువ స్ఫూర్తితో దేశ సేవలో ప్రాణత్యాగం చేసిన ధీరోత్తనాయకుడుగా ఆయనను స్మరించుకున్నారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దారిపి నేని వెంకటేశ్వర్లు మన్యం సునీల్ వెంకటాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ తాటి సరస్వతి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చిటెం సాయి సీనియర్ నాయకులు చిట్టెం టాకయ్య పలనాటి నాగేశ్వరరావు కాలువ సుందర్ రావు సీతాదేవి రవి వేల్పూరి సత్యనారాయణ జి నాగేశ్వరరావు మద్దుకూరు ప్రసాద్ ఆర్కే తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## ప్రజలకు అందుబాటులో ఉండాలి: ఎస్పీ నరసింహ

**అక్రమ రవాణా, అసాంఘిక చర్యలపై పటిష్ట నిఘా**

**మన దునియా,సూర్యాపేట జిల్లా: మే 21**




సూర్యాపేట: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నరసింహ ఐపీఎస్ నెలవారీ పోలీసు అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసుల దర్యాప్తులో నైపుణ్యంతో పని చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై పటిష్ట నిఘా ఉంచాలని ఆదేశించారు. డయల్--100 స్పందన, పెండింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల నియంత్రణ, మహిళా భద్రత తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం


## సెర్వైకల్ నొప్పితో బాధపడుతున్నారా?



ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. మెడలో బిగుసుకుపోవడం, భుజాలలో ఒత్తిడి, తలనొప్పి, వీపు నొప్పి వంటివి సెర్వైకల్ లక్షణాలుగా ఉండవచ్చు. సెర్వైకల్ నొప్పిని తగ్గించడానికి మీరు కొన్ని వ్యాయామాల సహాయం తీసుకోవచ్చు. ఈ వ్యాయామం మెడ బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కండరాలను సడలిస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి నిటారుగా కూర్చోండి లేదా నిలబడండి. ఆ తర్వాత మెడను నెమ్మదిగా ముందుకు వంచండి. ఆపై వెనుకకు వంచండి. ఈ ప్రక్రియను 5 నుండి 10 సార్లు చేయండి. దీని వల్ల సెర్వైకల్ నొప్పి తగ్గవచ్చు. ఇది మెడ సౌలభ్యాన్ని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి తలను నెమ్మదిగా కుడి వైపుకు తిప్పండి. కొన్ని సెకన్ల పాటు ఆపండి. ఆ తర్వాత తలను ఎడమ వైపుకు తిప్పండి. రెండు దిశలలో ఒక్కొక్కటి 5 సార్లు చేయండి. ఇది మెడ పక్కని కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. తలను నెమ్మదిగా కుడి వైపుకు వంచండి (చెవిని భుజం వైపు తీసుకురండి). 10 సెకన్ల పాటు ఆపండి. ఆపై ఎడమ వైపుకు పునరావృతం చేయండి. ఈ ప్రక్రియను 3-4 సార్లు చేయండి. ఈ భంగిమ మీ మెడ స్థానాన్ని మెరుగుపరుస్తుంది. సెర్వైకల్ నొప్పిని తగ్గిస్తుంది. దీన్ని చేయడానికి మీ వీపు, మెడను నిటారుగా ఉంచండి. ఆపై గడ్డాన్ని మెడ వైపు నెమ్మదిగా లోపలికి లాగండి. 5 సెకన్ల పాటు ఆపి, ఆ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వెళ్లండి. దీన్ని 10 సార్లు పునరావృతం చేయండి.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎస్త్ర పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్‌గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.



# కేటీఆర్.. నీ చెల్లి అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పు.. మహేశ్ గౌడ్ సవాల్

**మన దునియా,హైదరాబాద్:మే 21**

బీఆర్ఎస్, మాజీ మంత్రి కేటీఆర్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దుర్మార్గమైన పరిపాలన చేశారని ధ్వజమెత్తారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానంటున్నారని.. ఆయన పాదయాత్ర కాదని.. ఏం చేసినా రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ని క్షమించరని హెచ్చరించారు. కేసీఆర్.. అప్పులు చేసి ఫాంహౌస్‌లో పడుకున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ పాదయాత్రకు ముందు మీ చెల్లి కవిత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. గత పదేళ్ల కేసీఆర్ హయాంలో ఏం చేశారని.. ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క లెక్కలతో సమాధానాలు అడుగుతుంటే కేసీఆర్ అండ్ కో సతమతమవుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేత సంతోశ్‌రావు ఎలా సంతోషంగా ఉన్నారో.. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆనందం ఏంటో మీ దోపిడీ ఎంతో.. మీ చెల్లెలు కవిత చెబుతోందని సెటైర్లు గుప్పించారు. పదేళు దోపిడీకి అలవాటు పడి నేడు పదవులు కోల్పోయి ప్రజల ఆగ్రహానికి గురై నేడు విలవిలలాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ అండ్ కో పిచ్చిమాటలు మాట్లాడుతూ అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు.

**కాంగ్రెస్‌ది ప్రధాన పాత్ర..**

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకారం కార్యక్రమం ఈరోజు(మంగళవారం) జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రపంచంలోనే ఎక్కడ లేని విధంగా ఈ దేశంలో ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లా.. కాంగ్రెస్‌కి ఎప్పుడూ అండగా నిలిచిందని ఉద్ఘాటించారు. బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్న పీవీ నరసింహ రావు దేశ ప్రధాని అయ్యారని ప్రస్తావించారు. ఇది ఒక్క కాంగ్రెస్‌కే సాధ్యమని తెలిపారు.

**గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలి..**



గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలని మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతో నేడు తెలంగాణలో అధికారంలోకి వచ్చామని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని సమూలంగా వారికి నచ్చినట్లుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే.. కాంగ్రెస్ అడ్డుకుందని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహూల్ గాంధీ పోరాట ఫలితంగా కులగణన చేశారని ప్రస్తావించారు. కాంగ్రెస్‌లో సామాన్య కార్యకర్తలు కీలక పదవులు పొందారని అన్నారు. భట్టివిక్రమార్క చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందని ఉద్ఘాటించారు. ఖమ్మం గడ్డపై నిలబడి చెబుతున్నా.. వచ్చే ఎన్నిక కాదని.. ఆ తర్వాత వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. చేతనైతే తమ విజయాన్ని అడ్డుకోవాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తాము నెరవేరుస్తున్నామని తెలిపారు. ఖమ్మం నుంచే కాంగ్రెస్ విజయం ప్రారంభమైందని చెప్పుకొచ్చారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు..

# ఈ పండ్లను పొరపాటున కూడా ఫ్రిడ్జ్‌లో పెట్టకండి..

రోజువారీ ఆహారంలో పండ్లకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇవి శరీరానికి శక్తిని అందించడమే కాక.. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే రోజూ తీసుకోవాల్సినవే. అయితే కొందరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు ఫ్రిడ్జ్ సహాయాన్ని తీసుకుంటారు. కానీ కొన్ని రకాల పండ్లను ఫ్రిడ్జ్ లో నిల్వ ఉంచడం వల్ల పోషకాలు తగ్గిపోతాయి. అంతేకాదు వాటి సహజమైన రుచి, నాణ్యత కూడా తగ్గిపోతుంది. వేసవిలో ఎక్కువగా కనిపించే పుచ్చకాయను చాలా మంది ఫ్రిడ్జ్ లో నిల్వ చేస్తారు. కానీ దీని తేమ, పోషక విలువలు గది ఉష్ణోగ్రతలోనే బాగుంటాయి. ఫ్రిడ్జ్ లో ఉంచినప్పుడు ఇందులో ఉండే లైకోపిన్, బీటా కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పని చేయలేకపోతాయి. అందువల్ల పుచ్చకాయను ఫ్రిడ్జ్ లో కాకుండా గది ఉష్ణోగ్రతలో నిల్వ చేయాలి.మార్కెట్‌లో లభించే మామిడిపండ్లలో చాలా భాగం ఇథలీన్ వాయువుతో మగ్గించబడుతుంటాయి. అలాంటి పండ్లు ఫ్రిడ్జ్ లో ఉంచితే అవి త్వరగా నల్లబడిపోతాయి. మామిడి ఇంకా మగ్గని దశలో ఉంటే గది ఉష్ణోగ్రతే మంచి పరిష్కారం. పండని అవకాడోను ఫ్రిడ్జ్‌లో పెట్టినప్పుడు అది సమయానికి మగ్గకపోవచ్చు. కాస్త మగ్గిన తర్వాత ఫ్రిడ్జ్‌లో ఉంచితే కొంతకాలం నిల్వ ఉంటుంది. కానీ రుచి మెత్తబడకుండా ఉండాలంటే గది ఉష్ణోగ్రతే మేలు చేస్తుంది.చల్లదనంలో ఉంచిన ద్రాక్ష పండ్లు తేమ కోల్పోయి త్వరగా వాడిపోతాయి. ఫలితంగా రుచి తగ్గిపోతుంది. దీని వల్ల చర్మం కఠినంగా మారి రుచి బాగా తగ్గిపోతుంది. సహజంగా మగ్గే అవకాశం



ఉండే స్థలంలో ఉంచడం ఉత్తమం. అయితే పూర్తిగా మగ్గిన పైనాపిల్ ముక్కలను ఫ్రిడ్జ్‌లో తక్కువ సమయం ఉంచితే హానికరం కాదు. బాదం, జీడిపప్పు, కిస్మిస్ లాంటి డ్రైఫ్రూట్స్‌ను ఫ్రిడ్జ్‌లో ఉంచినప్పుడు అవి తేమతో తడిసిపోతాయి. ఫలితంగా ఫంగస్ ఏర్పడి రుచి మారుతుంది. ఇవి పొడి ప్రదేశంలో గాలి చొరబడకుండా ఉండే డబ్బాలో ఉంచడం ఉత్తమం. పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిదే. కానీ వాటిని ఎలా నిల్వ ఉంచుతున్నామనేది కూడా ముఖ్యం. కాబట్టి పండ్లు ఫ్రెష్‌గా, ఆరోగ్యకరంగా ఉండాలంటే వాటి లక్షణాలను బట్టి నిల్వ చేసే తీరు మార్చుకోవాలి.

## పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజానికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు



ఎక్కువగా ఉంటాయి.కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
RNI Number



# గుజరాత్ దెబ్బకు చెన్నై కథ సమాప్తం...

# ఐపీఎల్-2026 నుంచి సీఎస్కే ఔట్

**చెన్నైపై 89 పరుగుల భారీ తేడాతో గుజరాత్ టైటాన్స్ విజయం**

**ఈ ఓటమితో ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించిన సీఎస్కే**

**గిల్, సాయి సుదర్శన్, బట్లర్ అర్ధశతకాలతో గుజరాత్ భారీ స్కోరు**

**లక్ష్య ఛేదనలో 140 పరుగులకే కుప్పకూలిన చెన్నై సూపర్ కింగ్స్**

**బౌలింగ్‌లో సిరాజ్, రబాడ, రషీద్ ఖాన్ మూడేసి వికెట్లతో చెలరేగారు**



ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ప్రస్థానం ముగిసింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో 89 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలై ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ విజయంతో గుజరాత్ ప్లే ఆఫ్స్‌లో టాప్-2 స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకుంది.టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (37 బంతుల్లో 64), సాయి సుదర్శన్ (53 బంతుల్లో 84) అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 125 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత వచ్చిన జాస్ బట్లర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 27 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 57 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరు సాధించింది. 230 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ ఆది నుంచే తడబడింది. ఇన్నింగ్స్ తొలి బంతికే సంజూ శాంసన్ డకౌట్ అయ్యాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (16) మెరుపులు తాత్కాలికమే అయ్యాయి. మహమ్మద్ సిరాజ్ తన తొలి ఓవర్లలోనే కీలక వికెట్లు పడగొట్టి చెన్నైని కోలుకోలేని దెబ్బ తీశాడు. శివమ్ దూబె (17 బంతుల్లో 47) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో చెన్నై 13.4 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలింది. గుజరాత్ బౌలర్లలో మహమ్మద్ సిరాజ్, కగిసో రబాడ, రషీద్ ఖాన్ తలా మూడు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

# గుజరాత్ టాపార్డర్ ఊచకోత...

# సీఎస్కే ముందు భారీ టార్గెట్

**చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ భారీ స్కోరు**

**నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 229 పరుగులు చేసిన జీటీ**

**గిల్, సాయి సుదర్శన్, జోస్ బట్లర్ అద్భుత హాఫ్ సెంచరీలు**

**తొలి వికెట్‌కు 125 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన ఓపెనర్లు**

**గుజరాత్ బ్యాటర్ల ధాటికి తేలిపోయిన చెన్నై బౌలర్లు**

ఐపీఎల్ 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ టాపార్డర్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్, నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (64), సాయి సుదర్శన్ (84), జోస్ బట్లర్ (57లి) హాఫ్ సెంచరీలతో చెన్నై బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయించారు. ప్లే ఆఫ్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన ఈ మ్యాచ్ లో చెన్నై ముందు 230 పరుగుల కొండంత లక్ష్యం నిలిచింది.ఇన్నింగ్స్ ఆరంభం నుంచే గుజరాత్ ఓపెనర్లు గిల్, సుదర్శన్ చెన్నై బౌలర్లకు చుక్కలు చూపించారు. వీరిద్దరూ పోటీపడి బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలో తొలి వికెట్‌కు 125 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. 37 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 64 పరుగులు చేసిన గిల్ ఔటయ్యాక, సుదర్శన్ తన జోరు కొనసాగించాడు. మరోవైపు, క్రీజులోకి వచ్చిన జోస్ బట్లర్ వీరవిహారం చేశాడు. సాయి సుదర్శన్ 53 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 84 పరుగులు చేసి ఔటయ్యాడు. అయితే, చివరి వరకు క్రీజులో ఉన్న బట్లర్ కేవలం 27 బంతుల్లోనే 5 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 57 పరుగులు చేసి గుజరాత్‌కు భారీ స్కోరు అందించాడు. చెన్నై బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. అన్షుల్ కంబోజ్ 4 ఓవర్లలో 56 పరుగులు సమర్పించుకోగా, స్పెన్సర్ జాన్సన్ 47 పరుగులు ఇచ్చాడు.



# గుజరాత్ టైటాన్స్‌తో సమరం ..


# సీఎస్కే జట్టుకు ‘డూ ఆర్ డై’



ఐపీఎల్ 2026 సీజన్‌లో ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ బరిలోకి దిగింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న తమ చివరి లీగ్ మ్యాచ్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఓడితే చెన్నై టోర్నీ నుంచి నిష్క్రమించడం ఖాయం.గత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓటమి పాలైన చెన్నై, ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిచినా కూడా ప్లేఆఫ్స్ చేరాలంటే ఇతర మ్యాచ్‌ల ఫలితాలు కూడా అనుకూలించాల్సి ఉంటుంది. ఒకవేళ ఓడితే, అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన సీఎస్‌కే వరుసగా మూడో ఏడాది ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో విఫలమవుతుంది. ఈ కీలక పోరుకు సీనియర్ ఆటగాడు ఎంఎస్ ధోనీ జట్టుతో కలిసి ప్రయాణించలేదని వస్తున్న వార్తలు కెప్టెన్ రుతురాజ్‌పై మరింత ఒత్తిడి పెంచుతున్నాయి. ప్రస్తుతం ధోనీ తన స్వస్థలం రాంచీ వెళ్లిపోయినట్టు తెలుస్తోంది. కాగా, టాస్ గెలిచిన అనంతరం రుతురాజ్ మాట్లాడుతూ.. “పిచ్‌పై పేస్, బౌన్స్ ఉన్నాయి. వాటిని ఆరంభంలోనే సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో బౌలింగ్ ఎంచుకున్నాం. పరిస్థితులకు అనుగుణంగా జట్టులో రెండు మార్పులు చేశాం. మా ప్రణాళికలను సరళంగా ఉంచుకుని, ఈ మ్యాచ్‌లో గెలవడంపై దృష్టి పెట్టాం” అని చెప్పాడు. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. “మేము కూడా బౌలింగ్ చేయాలనే అనుకున్నాం. జట్టులో ఒక మార్పు ఉంది. పని ఇంకా పూర్తి కాలేదు, ఇక్కడి నుంచి మరో మూడు మంచి మ్యాచ్‌లు ఆడాలని ఆశిస్తున్నాం” అని అన్నాడు.చెన్నై సూపర్ కింగ్స్ (తుది జట్టు): సంజూ శాంసన్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఉర్విల్ పటేల్, డివాల్డ్ బ్రెవిస్, శివమ్ దూబే, మాథ్యూ షార్ట్, అన్షుల్ కంబోజ్, నూర్ అహ్మద్, స్పెన్సర్ జాన్సన్, ముఖేష్ చౌదరి, గుర్జప్నీత్ సింగ్.ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: కార్తీక్ శర్మ, మెక్‌నీల్ నొరోన్హా, సర్ఫరాజ్ ఖాన్, కుల్దీప్ యాదవ్, అమన్ ఖాన్.గుజరాత్ టైటాన్స్ (తుది జట్టు): సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), నిశాంత్ సింధు, వాషింగ్టన్ సుందర్, జాసన్ హోల్డర్, రషీద్ ఖాన్, రాహుల్ తెవాటియా, కగిసో రబాడ, అర్షద్ ఖాన్, మహ్మద్ సిరాజ్.ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: ప్రసిద్ధ్ కృష్ణ, అనూజ్ రావత్, గ్లెన్ ఫిలిప్స్, కుల్వంత్ ఖేజ్రోలియా, కుమార్ కుశాగ్ర.

## నా కెరీర్ ముగించడానికి అతడు అన్ని ప్రయత్నాలు చేశాడు: గుత్తా జ్వాల

భారత మాజీ బ్యాడ్మింటన్ స్టార్ జ్వాలా గుత్తా తన కెరీర్‌పై సంచలన వ్యాఖ్యలు చేసింది. సరైన మద్దతు లభించి, వివాదాలకు దూరంగా ఉండుంటే తాను ప్రపంచ నంబర్ వన్ అయ్యేదాన్నని ఆమె అభిప్రాయపడింది. అప్పటి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) అధ్యక్షుడు వీకే వర్మ, ఇతర కోచ్‌లు తన కెరీర్‌ను దెబ్బతీయాలని చూశారని ఆమె తీవ్ర ఆరోపణలు చేసింది. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేసింది.2010 కామన్వెల్త్ గేమ్స్‌లో జరిగిన ఓ ఘటనను ఆమె గుర్తుచేసుకుంది. ఆ టోర్నీలో తాను, అశ్విని పొన్నప్ప డబుల్స్ స్వర్ణం గెలిచిన తర్వాత సైనా నెహ్వాల్ సింగిల్స్‌లో స్వర్ణం సాధించిందని తెలిపింది. “మేం స్వర్ణం గెలిచినప్పుడు వీకే వర్మ పట్టించుకోలేదు. కానీ, రెండు గంటల తర్వాత సైనా గెలవగానే అతడు కోర్టులోకి పరుగెత్తుకెళ్లి సంబరాలు చేసుకున్నాడు. మా స్వర్ణం తక్కువేమీ కాదు కదా? అని ఆనాడే ప్రశ్నించాను” అని జ్వాలా వివరించింది.వీకే వర్మ తన కెరీర్‌ను ముగించేందుకు తీవ్రంగా ప్రయత్నించాడని జ్వాలా ఆరోపించింది. “2006లో ఎలాంటి కారణం చెప్పకుండా నన్ను జట్టు నుంచి తొలగించారు. మళ్లీ రియో ఒలింపిక్స్ తర్వాత కూడా అదే పునరావృతమైంది. ఆ తర్వాత పోరాడి ప్రయోజనం ఏముందనిపించింది” అని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఏ క్రీడాకారుడూ వివాదాలు కోరుకోడని, కానీ తన హక్కుల కోసం పోరాడాల్సి వచ్చిందని ఆమె పేర్కొంది. ఒలింపిక్ ఛాంపియన్ నీరజ్ చోప్రా దీనికి సరైన ఉదాహరణ అని, ఒక ప్రపంచ ఛాంపియన్‌ను తయారు చేయడానికి ఎంత వ్యక్తిగత శ్రద్ధ, పెట్టుబడి అవసరమో అతన్ని చూస్తే తెలుస్తుందని జ్వాల వెల్లడించింది. “ఎలాంటి ఆర్థిక మద్దతు, స్పాన్సర్‌షిప్ లేకుండానే నేను వరల్డ్ నంబర్ 5కి చేరుకున్నాను. అదే మద్దతు ఉండి ఉంటే నంబర్ వన్ అయ్యేదాన్ని” అని జ్వాలా తెలిపింది. క్రీడా వ్యవస్థలో మార్పు రావాలని, నేటి క్రీడారంగంలో రాజకీయ పలుకుబడి ఉన్నవారి మాటే నెగ్గుతోందని ఆమె వ్యాఖ్యానించింది.




మన దునియా

RNI Number

మన అక్షరం - మన ప్రపంచం

## పొలిటికల్ ఎంట్రీపై తిరుగులేని క్లారిటీ ఇచ్చిన రామ్ చరణ్



**రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని స్పష్టం చేసిన రామ్ చరణ్**

**చిత్ర పరిశ్రమలో నంబర్ వన్ కావడమే తన లక్ష్యమని వెల్లడి**

**'పెద్ది' తన కెరీర్‌లో ఎంతో నిజాయతీగా చేసిన చిత్రమని వ్యాఖ్య**

**డూప్ లేకుండా స్టంట్స్ చేయడం తనకిష్టమని, తండ్రే స్ఫూర్తి అని వెల్లడి**

**బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' జూన్ 4న పాన్ ఇండియా స్థాయిలో విడుదల**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన రాజకీయ ప్రవేశంపై వస్తున్న ఊహాగానాలకు స్పష్టత ఇచ్చారు. తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని, సినిమా రంగంలో అగ్రస్థానానికి చేరడమే తన లక్ష్యమని తేల్చి చెప్పారు. తన తాజా చిత్రం 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు."అభిమానులు మిమ్మల్ని సీఎంగా చూడాలనుకుంటున్నారు, మీరు రాజకీయాల్లోకి వస్తారా?" అన్న ప్రశ్నకు చరణ్ బదులిస్తూ.. "రెండు పడవలపై ప్రయాణం చేయాలనుకోవడం లేదు. నా పూర్తి దృష్టి నటనపైనే ఉంది... నటనా రంగంలో మేటిగా నిలవడంపైనే నా దృష్టంతా!" అని అన్నారు.తన కొత్త సినిమా 'పెద్ది' గురించి మాట్లాడుతూ, ఇది తన కెరీర్‌లో ఎంతో నిజాయతీగా చేసిన చిత్రమని తెలిపారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో, తన అస్తిత్వాన్ని వెతుక్కునే 'పెద్ది' అనే యువకుడిగా కనిపిస్తానని వివరించారు. ఈ పాత్ర కోసం శారీరకంగా, మానసికంగా ఎంతో కష్టపడ్డానని చెప్పారు. క్రీడా నేపథ్య డ్రామాగా వస్తున్న ఈ సినిమా తప్పకుండా ఆకట్టుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.రిస్కీ షాట్‌లలో డూప్‌ల సహాయం లేకుండా నటించడానికే ఇష్టపడతానని, తన తండ్రి చిరంజీవి 71 ఏళ్ల వయసులో కూడా స్టంట్స్ చేస్తున్నారని, అలాంటి సన్నివేశాలు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతాయని రామ్ చరణ్ పేర్కొన్నారు. బుచ్చిబాబు దర్శకత్వం వహించిన 'పెద్ది' చిత్రం జూన్ 4న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

## 30 ఏళ్ల రివర్స్ సీన్.. తమ్ముడి క్లాప్‌పై చిరంజీవి ఎమోషనల్ ట్వీట్!

మెగాస్టార్ చిరంజీవి 158వ సినిమా పూజా కార్యక్రమాలతో ఈరోజు లాంఛనంగా ప్రారంభమైంది. ఈ ఓపెనింగ్ వేడుకకు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తన అన్నయ్య చిరంజీవిపై తీసిన ముహూర్తపు షాట్‌కు పవన్ కల్యాణ్ క్లాప్ కొట్టారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్లాప్ బోర్డ్ వెనుక ఉన్న ఒక అద్భుతమైన 30 ఏళ్ల నాటి విషయాన్ని గుర్తుచేస్తూ చిరంజీవి ఎక్స్‌లో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు."ఈ రోజు కల్యాణ్ బాబుకి, నాకు మధ్యలో క్లాప్ కనిపిస్తుంటే... 30 సంవత్సరాల క్రితం ఇదే సీన్ రివర్స్‌లో జరిగిన సందర్భం గుర్తుకు వస్తోంది ... 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈ రోజు డిప్యూటీ సీఎం హోదాలో టైమ్ తీసుకుని వచ్చి, నా 158వ సినిమా ముహూర్తంలో పాల్గొని, క్లాప్ ఇచ్చి యూనిట్ సభ్యులందరినీ ఆనందపరిచినందుకు థాంక్యూ" అని చిరంజీవి భావోద్వేగాన్ని వ్యక్తం చేశారు.ఫ్లాష్‌బ్యాక్: సరిగ్గా 30 సంవత్సరాల క్రితం, పవన్ కల్యాణ్ హీరోగా సినిమా ఇండస్ట్రీకి పరిచయమైన క్లాసిక్ మూవీ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' (1996). ఆరోజు ఆ సినిమా ముహూర్తపు షాట్‌కు అన్నయ్యగా చిరంజీవి ముందుండి తమ్ముడు పవన్ కల్యాణ్‌కు క్లాప్ కొట్టి వెండితెరకు పరిచయం చేశారు. ఇవాళ అదే సీన్ రివర్స్ అయింది. ఆరోజు అన్నయ్య క్లాప్ కొట్టి తమ్ముడిని ఆశీర్వదించారు. ఈరోజు తమ్ముడు ఏకంగా ఒక రాష్ట్రానికి డిప్యూటీ సీఎం హోదాలో వచ్చి.. అన్నయ్య 158వ సినిమాకు క్లాప్ కొట్టారు. మూడు దశాబ్దాలు గడిచినా, మెగా బ్రదర్స్ మధ్య ఉన్న అనుబంధం మాత్రం అలాగే ఉందనడానికి ఈ క్లాప్ బోర్డ్ విజువల్ ఒక పెద్ద నిదర్శనం.మరోవైపు, ఈ సినిమాకు బాబీ కొల్లి దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో మలయాళ యువ నటి అనశ్వర రాజన్ కీలక పాత్ర పోషిస్తోంది.





# విజయాన్ని శాసించేది ఆ మూడు మాత్రమే

నెపోటిజం గురించి చాలామంది స్టార్‌కిడ్స్ చాలా సందర్భాల్లో మాట్లాడారు. తాజాగా మహేశ్ మంజ్రేకర్ ముద్దుల తనయ సాయి మంజ్రేకర్ కూడా ఈ అంశంపై తనదైన శైలిలో స్పందించారు. సినీ పరిశ్రమలో నటవారసత్వం అనే అంశంపై ఇటీవల ఆమె మాట్లాడుతూ 'ఇంటిపేరనేది బలమైన కెరీర్‌కి గ్యారెంటీ కార్డు కాదు. అది కేవలం ప్రారంభంలో పరిచయాలకూ, తొలి సినిమా అవకాశానికి మాత్రమే సహాయపడుతుంది. జనానికి కనెక్ట్ కానప్పుడు, ఎంతటి సూపర్‌స్టార్ వారసులైనా తలదించుకొని వెనక్కెళ్లిపోవాల్సిందే. అందుకే 'మంజ్రేకర్' అనే కంఫర్ట్ జోన్ నుంచి పూర్తిగా బయటకు వచ్చి, కేవలం నా కష్టం, అంకితభావంతో ఇండస్ట్రీలో నిలబడాలనుకుంటున్నా. హార్డ్‌వర్క్, క్రమశిక్షణ, పట్టుదల.. ఈ మూడు మాత్రమే విజయాన్ని శాసిస్తాయి' అని సాయి మంజ్రేకర్ పేర్కొన్నది. 'మేజర్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన సాయి మంజ్రేకర్.. ప్రస్తుతం తెలుగు చారిత్రాత్మక పానిండియా చిత్రం 'ఇండియా హౌస్'లో కథానాయికగా నటిస్తున్నది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com